సాక్షి అనకాపల్లి

మంగళవారం । 9 । సెప్టెంబర్ । 2025



పేద కళాకారులకు కాప్ సాయం: గౌతంరాజు 8లో



ప్రభుత్వ వైద్య కళాశాలలపై ప్రై'వేటు' సిగ్గుచేటు 8లో



వేంపాడులో భారీ చోరీ 8లో



దేవరాపల్లి : సోమవారం ఎ.కొత్తపల్లి రైతు సేవా కేంద్రం వద్ద నిరీక్షిస్తున్న రైతులు



మాడుగుల రూరల్ రైతు సేవా కేంద్రంలో రైతులను నియంత్రిస్తున్న పోలీసులు (ఫైల్)



కె.జె.పురం రైతు సేవా కేంద్రం వద్ద యూరియా కోసం నిరీక్షిస్తున్న రైతులు (ఫైల్)

● అన్నదాత పోరుబాట

యూరియా..ఏదయ్యా..!

- ఎరువులను సమకూర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలం
- పీఏసీఎస్, రైతు సేవా కేంద్రాల వద్ద రైతుల పడిగాపులు
- జిల్లాలో 32,321 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం
- అందుబాటులో 12 వేల టన్నులు
- ఎరువుల సరఫరాలో కూటమి నేతల చేతివాటం
- రైతులకు మద్దతుగా వైఎస్సార్‌సీపీ పోరుబాట
- నేడు ఆర్డీవో కార్యాలయం ఎదుట నిరసన

ఖరీఫ్ సీజన్ ఆరంభమై మూడు నెలలైనా రైతులకు అవసరమైన యూరియా అందుబాటులో ఉండడం లేదు. వరి నాట్లు వేసి నెల రోజులు దాటినా నేటికీ యూరియా అందక పడిగాపులు కాస్తున్నారు. పగలనక, రాత్రనక యూరియా కోసం రైతు సేవా కేంద్రాలు, ప్రైవేటు డీలర్ల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. వచ్చిన కొద్దిపాటి యూరియాను రైతులకు ఒక్కో కట్ట మాత్రం అందిస్తున్నారు. మరో పక్క యూరియా రైతులందరికీ అందుబాటులో ఉందంటూ అధికారులు ప్రకటనలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అన్నదాత ఎరువుల కోసం రోడ్డెక్కుతున్నాడు. రైతులకు అండగా వైఎస్సార్‌సీపీ పోరుబాట పట్టింది.



కె.కోటపాడులో యూరియా కోసం క్యూలో ఉన్న రైతులు (ఫైల్)

సాక్షి, అనకాపల్లి:

రైతులకు ఈ ఖరీఫ్ సీజన్‌లో యూరియాను సమకూర్చడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే ముందస్తుగా ఎన్ని టన్నుల యూరియా అవసర ముంటుందో ప్రభుత్వానికి తెలిసినప్పటికీ రైతుల పట్ల పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. అయితే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమకూర్చిన ఎరువులు సమృద్ధిగా ఉండడంతో గతేడాది కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినా.. రైతులకు అంత కొరత రాలేదు. కానీ ఈ ఖరీఫ్ సీజన్‌లో మాత్రం ఇటు పెట్టుబడి పెట్టలేక..అటు యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడతున్నారు. వరి నాట్లు ప్రాథమిక దశలోనే యూరియా వేస్తే పంట ఏపుగా ఎదుగుతుంది. ఇప్పుడా యూరియానే బంగారమైపోయింది. యూరియా కోసం రైతుసేవాకేంద్రాల్లో, పీఏసీఎల్ కేంద్రాల వద్ద క్యూలో నిల్చున్నా బస్తా యూరియా సంపాదించడం కష్టంగా మారింది. ఎరువు లేక పంటల్లో ఎదుగుదల లోపిస్తోందనే ఆవేదన రైతుల్లో వ్యక్తమవుతోంది. ఆ ఆవేదన రైతు ఒకటి తీసుకునే దగ్గర రెండు తీసుకుంటున్న పరిస్థితులున్నాయి. అది కూడా ఎక్కడైనా స్టాక్ వచ్చిందంటే తొలుత కూటమి నేతలు సగంకు పైగా దారి మళ్లిస్తున్నారు. మిగిలిన వాటిని అరకొరగా రైతులకు ఇస్తున్నారు. రైతు వేసే వరి నాట్లు ఆధారంగా రెండు మూడు కావాల్సిన వారికి కూడా ఒకటే యూరియా బస్తా ఇవ్వడంతో చాలా చోట్ల ఆగ్రహంగా మారి అన్నదాతలను రోడ్డెక్కేలా చేస్తోంది. గత నెల రోజులుగా జిల్లాలో ఇదే పరిస్థితి నెలకొంది, చాలాచోట్ల రైతులు.. ఎరువుల కేంద్రాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. గుంపులు గుంపులుగా రహదారుల మీదకొచ్చి రాస్తారోకోలు చేశారు. క్యూలైన్లలో తోపులాటలు జరుగుతున్నాయి. కొన్నిచోట్ల సిబ్బందిపై రైతులు తిరగబడుతున్నారు.

నానో యూరియాను అంటగట్టే యత్నం..

రైతులు వినియోగించే ఎరువులు, యూరియాపై కూటమి సర్కార్ దొంగాట ఆడుతోంది. సరిపడా యూరియా, ఎరువులు నిల్వలు ఉన్నాయంటూ అధికారులు పేపర్ లెక్కలే తప్ప క్షేత్రస్థాయిలో పరిస్థితులకు సంబంధం లేకుండా పోయింది. పంటలు వేసిన తర్వాత యూరియా, ఇతర ఎరువులు ఎంతో అవసరం ఉంటుంది. ప్రైవేట్ దుకాణాల్లో నానో యూరియా, నానో డీఏపీల పేరిట రైతులకు అంటకట్టడానికి ఆలోచనతో కూటమి సర్కార్ యూరియాను కృత్రిమ కొరతను సృష్టిందన్న విమర్శలు వస్తున్నాయి. యూరియా సరిపడా వస్తుందని రైతులకు వ్యవసాయ అధికారులు నచ్చచెబుతున్నారు. కానీ యూరియా రాక పోవడం, సహకార సంఘాల వద్ద యూరియా కోసం రైతులు పడిగాపులు పడుతున్నారు. జిల్లాకు చేరిన యూరియా, డీఏపీ ఎరువులు చేరినట్టు అధికారులు లెక్కలు చెబుతున్నారు. కానీ క్షేత్ర స్థాయిలో ఇవి చేరుకోకపోవడం గమనార్హం. కేంద్ర ప్రభుత్వం కూడా నానో యూరియా అమ్మకాలు పెంచాలని, ఇటు వ్యవసాయ అధికారులకు, అటు కూటమి సర్కార్ మీద వత్తిడి తెస్తున్నారు. యూరియాను విక్రయిస్తున్న సహకార సంఘాలు, రైతు భరోసా కేంద్రాలను లక్ష్యాలను నిర్దేశిస్తున్నారు. ఇదే పరిస్థితిలో నానో యూరియాను కూడా కొనుగోలు చేయాలని, రైతుల నెత్తిన నానో యూరియా రుద్దడానికి వ్యవసాయ అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో అన్నదాత పోరుబాట..

అనకాపల్లి జిల్లాలో యూరియా కొరతతో పలు ఇబ్బందులు గురవుతున్న రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో ఈ నెల 9న అనకాపల్లి, నర్సీపట్నం ఆర్డీవో కార్యాలయాల వద్ద మరో పోరాటానికి సిద్ధమైంది. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ నేతృత్వంలో యూరియా కొరతపై అనకాపల్లి ఆర్డీవో కార్యాలయాల వద్ద 'అన్నదాత పోరుబాట' పేరిట ఆందోళనలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నిర్ణయించింది. జిల్లాలో యూరియా కొరతతో ఇబ్బందులు పడుతున్న రైతులకు అండగా రైతుల సంఘాల నాయకులు కూడా పాల్గొనాలని వైఎస్సార్ సీపీ పిలుపునిచ్చారు. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకు రావాలనే ఉద్దేశ్యంతోనే ఈ నిరసన కార్యక్రమం చేపడుతున్నట్టు వైఎస్సార్‌సీపీ తెలిపింది. అనకాపల్లి, మర్రీపట్నం ఆర్డీవో కార్యాలయం వద్ద వైఎస్ఆర్సీపీ ఆధ్వర్యంలో రైతులకు మద్దతుగా నిరసన కార్యక్రమం చేపట్టనున్నారు. అనంతరం ఆర్డీవో కు వినతి పత్రం అందజేయనున్నారు. గతంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉన్న సమయంలో రైతులకు ఎరువులు, విత్తనాల సమస్య అనేది ఎక్కడా లేదన్నారు. ఈఖరీఫ్ సీజన్ లో యూరియాను రైతులకు అందించకుండా కూటమి నేతలు పక్కదారి పట్టిస్తున్న నేపథ్యంలో వైఎస్సార్‌సీపీ మరో పోరాటానికి సిద్ధమైంది. ప్రధానంగా యూరియా కొరత, రైతుల సమస్యలపై పరిష్కారం కోరుతూ ఆర్డీవోలకు వినతి పత్రాలు అందజేయనున్నారు.

కొన్ని ప్రైవేటు దుకాణాల్లోనే...

జిల్లా వ్యాప్తంగా 98 శాతం వరినాట్లు వేశారు. ప్రస్తుతం యూరియా కొరత తీవ్రంగా ఉంది. డీఏపీ అంతంతమాత్రంగానే ఉంది. కూటమి నేతల జోక్యం కారణంగా కొత్తగా యూరియా స్టాక్ వచ్చినా వారి అనుకూల ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో రూ.400 నుంచి రూ.450 వరకూ వెచ్చించి రైతులు బ్లాక్‌లో కొనుగోలు చేస్తున్నారు. కొన్ని ప్రైవేట్ దుకాణాలకే యూరియా ఇస్తున్నారు.

జిల్లాలో పరిస్థితి ఇలా..

జిల్లాలో ఖరీఫ్ రైతులు 2 లక్షల ఎకరాల్లో పంటల సాగు చేస్తారు. వీటిలో వరి 1.60 వేల ఎకరాల్లో సాగు చేస్తారు. ఈ ఖరీఫ్‌లో 20 వేల మెట్రిక్ టన్నులు ఎరువులు వినియోగిస్తారని అంచనా. అయితే జిల్లాలో ఇప్పటివరకూ 12 వేల మెట్రిక్ టన్నులు వరకూ యూరియా ఇచ్చారు. మరో 801 మెట్రిక్ టన్నుల యూరియా మార్క్‌ఫెడ్, ప్రైవేట్ సొసైటీలు, రైతు సేవాకేంద్రాలలో అందుబాటులో ఉన్నాయి. వారం రోజుల్లో 1500 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు రానుందని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు వెల్లడించారు.

క్లస్టర్ విధానం రద్దు చేయాలి



కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన క్లస్టర్ విధానంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాశీపురం రైతు సేవా కేంద్రాన్ని సుమారు 4 కిలో మీటర్ల దూరంలో రైవాడలో కలపడం దారుణం. దీంతో కాశీపురం పరిధిలోని రైతులంతా ఎరువులు కోసం రైవాడ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. రైతులను ఇబ్బందులకు గురి చేసే ఇలాంటి క్లస్టర్ విధానాన్ని రద్దు చేయాలి.

– దాసరి గోపి, రైతు, కాశీపురం.

పంటల విస్తీర్ణం ఆధారంగా...



ప్రభుత్వ ఆదేశాల మేరకు అగ్రికల్చర్, హార్టికల్చర్ పంటల విస్తీర్ణం ఆధారంగా రైతు సేవా కేంద్రాలను క్లస్టర్లుగా విభజించాం. మండలంలో 20 రైతు సేవా కేంద్రాలను 14 క్లస్టర్లుగా మార్పు చేశాం. అక్కడ సిబ్బందిని సర్దుబాటు చేశాం. రైతులకు ఇబ్బంది లేకుండా అన్ని రైతు సేవా కేంద్రాల్లో అందించేలా చర్యలు చేపడుతున్నాం. ముషిడిపల్లి, కాశీపురం తదితర గ్రామాల రైతులకు క్లస్టర్లలో పంపిణీ చేయడంతో కాస్తా ఇబ్బంది పడడం వాస్తవమే.

–ఎల్‌వై. కాంతమ్మ, మండల వ్యవసాయ అధికారి, దేవరాపల్లి

ఒక్క బస్తా అయినా ఇవ్వలేదు..



దమ్ములో వేయడానికి వరి నాట్లు వేసి నెల రోజులు దాటినా యూరియ అందుబాటులో లేదు. గత ప్రభుత్వంలో రైతు భరోసా కేంద్రాల్లో, ప్రైవేటు షాపుల్లో ఎప్పుడు వెళ్లినా యూరియా దొరికేది. ఇపుడు ప్రభుత్వ, ప్రైవేటు షాపుల్లో యూరియా దొరక్కపోతే మేం ఎక్కడికి వెళ్లి తెచ్చుకోవాలి.

– బండి రాజారావు, లోపూడి రైతు, బుచ్చెయ్యపేట మండలం

క్లస్టర్ విధానంతో కొత్త కష్టాలు

దేవరాపల్లి: అన్నదాతలు ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల కోసం మండల కేంద్రానికి వెళ్లే అవసరం లేకుండా రైతుల చెంతనే అన్నీ అందజేయాలని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను తీసుకువచ్చింది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతు భరోసా కేంద్రాలను రైతు సేవా కేంద్రాలుగా పేరు మార్పు చేసి తీసుకువచ్చిన క్లస్టర్ విధానంతో అన్నదాతలకు కొత్త కష్టాలు మొదలయ్యాయి. రెండు రైతు సేవా కేంద్రాలను కలిపి క్లస్టర్‌గా మార్పు చేయడంతో యూరియా, విత్తనాల కోసం రైతులు పక్క ఆర్ఎస్‌కేలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో భారీ క్యూలైన్‌లలో గంటల తరబడి పడిగాపులు కాయాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేవరాపల్లి మండలంలో రైతు సేవా కేంద్రాలను 14 క్లస్టర్లుగా మార్పు చేశారు. గరిశింగి, తెనుగుపూడి ఆర్ఎస్‌కేలను క్లస్టర్‌గాను, చింతలపూడి, నాగయ్యపేటను మరో క్లస్టర్‌గా, ఎం.అలమండ, పెదనందిపల్లిని మరో క్లస్టర్‌గా విభజించారు. ఎ. కొత్తపల్లి, ముషిడిపల్లి ఆర్ఎస్‌కేలను క్లస్టర్‌గా, కాశీపురం, రైవాడను క్లస్టర్‌గా, దేవరాపల్లిలోని రెండు ఆర్ఎస్‌కేలను మరో క్లస్టర్‌గా ఏర్పాటు చేశారు. దీంతో ముషిడిపల్లి సచివాలయ పరిధిలోని రైతులకు ఎ.కొత్తపల్లి సచివాలయంలో, కాశీపురం రైతులకు ఎరువులు తీసుకోవాలంటే నాలుగు కిలోమీటర్ల దూరంలో ఉన్న రైవాడ వెళ్లి తీసుకోవాల్సి ఉంటుంది.



కాశీపురంలో సిబ్బంది లేక తాళం వేసి ఉన్న రైతు సేవా కేంద్రం



దేవరాపల్లి మండలంలో యూరియా కోసం ఆర్ఎస్‌కే వద్ద రైతుల పడిగాపులు (ఫైల్)

న్యూస్‌రీల్

జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన వినీల

మునగపాక: మండలంలోని పాటిపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన ఇంటర్ విద్యార్థిని వి.వినీల జాతీయ స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైంది. ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న వినీల తొలి నుంచి బాల్ బ్యాడ్మింటన్‌లో రాణిస్తూ ఉండేది. అంతర్ జిల్లాల పోటీ ల్లో పాల్గొన్న ఆమె అంచెలంచెలుగా ఎదిగి రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో పతకం సాధించి మరింత ప్రతిభ చూపి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి తెలిపారు. వినీలతో పాటు ఆమె కృషికి కారణమైన పీటీ మహలక్ష్మిని ఎస్ఎంసీ చైర్మన్ జోగినాయుడు, ఉపాధ్యాయులు అభినందించారు.

వియత్నాంతో పర్యాటక ఒప్పందం



వియత్నాం ప్రతినిధులతో ఏపీ సీఎస్ అజయ్ జైన్, కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట(విశాఖ): ఆంధ్రప్రదేశ్‌లో పర్యాటక రంగానికి మరింత ప్రోత్సాహం ఇచ్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వియత్నాంతో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ అజయ్ జైన్, వియత్నాం టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ చైర్మన్ చౌ ట్రీ యంగ్ మధ్య అవగాహన ఒప్పందం కుదిరింది. ఈ ఒప్పందం ప్రకారం, బౌద్ధమతానికి సంబంధించిన ప్రాంతాలైన అమరావతిలోని కాలచక్ర, ఉమ్మడి విశాఖ జిల్లాలోని బొజ్జన్నకొండ, బావికొండ, తొట్లకొండ ప్రదేశాలను సందర్శించేందుకు వియత్నాం పర్యాటకులు వచ్చేలా చర్యలు తీసుకుంటారు. ఈ సందర్భంగా చౌ ట్రీ యంగ్‌ను స్పెషల్ సీఎస్ అజయ్ జైన్, కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ సత్కరించారు. కార్యక్రమంలో టూరిజం శాఖ అధికారులు జె. మాధవి, జగదీష్, ట్రావెల్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపు జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు ఈనెల 10న నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈవో పి.నారాయణమూర్తి తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఒకటి నుంచి ఏడు వరకు గల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా జరుగుతాయని పేర్కొన్నారు. ప్రగతి నివేదికలతో అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.

దౌర్జన్యాలతో ఉద్యమాలను ఆపలేరు



యలమంచిలిలో రాష్ట్ర ప్రభుత్వ తీరుపై నిరసన తెలియజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

యలమంచిలి రూరల్: ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సమస్యలపై గొంతెత్తిన విద్యార్థులపై కూటమి ప్రభుత్వ పెద్దలు పోలీసులతో దౌర్జన్యానికి తెగబడడం దారుణమని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు మైలపల్లి బాలాజీ అన్నారు. ఈ నెల 6వ తేదీన విజయవాడలో విద్యార్థి సంఘం నాయకులపై పోలీసులు పిడిగుద్దులతో నిర్బంధించిన అమానుష ఘటనపై సోమవారం యలమంచిలిలో ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు నిరసన తెలిపారు.కూటమి ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలను నాయకులు ఎండగట్టారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు విద్యార్థుల సమస్యలకు సంబంధించిన వినతిపత్రం తీసుకునేందుకు కూడా ఖాళీ లేకపోవడం దురదృష్టకరమన్నారు. పోలీసుల దాడిలో పలువురు విద్యార్థులు, సంఘం నాయకులు గాయపడ్డారన్నారు. కూటమి ప్రభుత్వ 15 నెలల పాలనలో విద్యార్థుల సమస్యలు ఒక్కటి కూడా పరిష్కరించలేదని, ఇంకా సమస్యలు రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ తీరు మార్చుకోకపోతే భవిష్యత్తులో ఉద్యమం మరింత ఉధృతమౌతుందని బాలాజీ హెచ్చరించారు. వెంటనే విద్యాశాఖ అధికారులు ఎస్ఎఫ్ఐ నాయకులు, గాయపడిన విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

ఒకే రోజు అల్లుడు, మామ మృతి 8లో

విధుల్లో అంకితభావంతో గుర్తింపు



ఎస్పీ తుహిన్ సిన్హాకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న పదోన్నతి పొందిన ఎస్ఐలు

అనకాపల్లి: పోలీస్ శాఖలో అంకిత భావంతో విధులు నిర్వహించినట్టయితే మంచి గుర్తింపు వస్తుందని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. తమ కార్యాలయంలో సోమవారం జిల్లాలో నలుగురు ఏఎస్ఐలు ఎస్ఐలుగా పదోన్నతి పొందిన ఎం.డి. వై.మొహిద్దిన్, ఆర్.వి.రామనాయుడు, పి.శంకర రావు, ఎం.రాజారావులు ఎస్పీ తుహిన్ సిన్హాను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కానిస్టేబుళ్ల నుంచి ఏఎస్ఐగా పదోన్నతి పొందిన ఎస్ఐలు జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో శాంతి భద్రతల పరిరక్షణలో విశేష కృషి చేయడం జరిగిందన్నారు. కొత్తగా పదోన్నతి పొందిన వారు పోలీస్‌శాఖకు మంచి గుర్తింపు తీసుకువచ్చే విధంగా విధులు నిర్వహించాలని ఎస్పీ కోరారు.

నేత్రదాన ప్రాముఖ్యతపై వ్యాసరచన పోటీలు

విజేతలకు ప్రశంసాపత్రాలు



విజేతలైన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

తుమ్మపాల: నేత్రదాన అవశ్యకత, నేత్రదాన ప్రాముఖ్యతపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు కలెక్టర్ విజయ కృష్ణన్, జేసి.జాహ్నవి ప్రశంస పత్రాలు అందించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో 40వ నేత్రదాన పక్షోత్సవాల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలలకు చెందిన 10వ తరగతి విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలైన విద్యార్థులను సోమవారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో అభినందించారు. పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డాక్టర్ టి.డేవిడ్ కుమార్, బోడ మోహన్‌రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అవసరం మేరకే యూరియా కొనండి..

రైతులకు జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ సూచనలు

సాక్షి, అనకాపల్లి: రైతుల అవసరాల మేరకే యూరియా కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ఒక ప్రకటనలో సూచించారు. యూరియా తీసుకున్న రైతులు అనవసరంగా ఇళ్లల్లో స్టాకు పెట్టుకోవద్దంటూ సూచించారు. ఎరువులు ఎంతమేరకు వినియోగించాలో రైతులతో అవగాహన కార్యక్రమాలను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఎరువులు పంపిణీని మండల వ్యవసాయ అధికారితో పాటు పలు మండలాల్లో జిల్లా వ్యవసాయ అధికారి కూడా పర్యవేక్షిస్తున్నారని పేర్కొన్నారు. ఎరువుల డీలర్లు ఎవరైనా ఎమ్మార్పీ రేట్లు కంటే ఎక్కువ అమ్మితే ఎరువులు చట్టం- 1985 కింద వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

9,164 టన్నుల యూరియా సరఫరా..

జిల్లాలో ఇప్పటివరకూ 9,164 టన్నుల యూరియాను సరఫరా చేశామని జిల్లా వ్యవసాయ అధికారి మోహన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. 736 టన్నుల యూరియా అందుబాటులో ఉంచామన్నారు. మరో రెండు రోజుల్లో 1064 టన్నులు యూరియా జిల్లాకు సరఫరా అవుతుందని, రైతులెవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.

'అన్నదాత పోరు'కు తరలిరండి..

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



వైఎస్సార్‌సీపీ శ్రేణుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి,పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్

అనకాపల్లి: కూటమి ప్రభుత్వ పాలనలో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, మన రాష్ట్రం వ్యవసాయంపై అధారపడి ఉందని, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు సకాలంలో యూరియా అందజేయడంలో ప్రభుత్వం విఫలమైందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. స్థానిక రింగ్ రోడ్డు పార్టీ కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ ఆధ్వర్యంలో సోమవారం పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో ఖరీఫ్ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు యూరియా నిల్వ చేయడం జరిగిందని, ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టడంతో అన్న యూరియాను రైతులకు సకాలంలో అందజేయడం వల్ల గత ఏడాది యూరియా సమస్య లేకుండా పోయిందన్నారు. ఈ ఏడాది సీఎం చంద్రబాబు ఖరీఫ్ సీజన్ దృష్టిలో పెట్టుకుని రైతులకు సకాలంలో యూరియాను అందజేయకపోవడం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రైతుల పక్షాన వైఎస్సార్‌సీపీ అండగా నిలుస్తుందని అన్నారు. మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈనెల 9న రాష్ట్ర వ్యాప్తంగా ఆర్డీవో కార్యాలయాలు వద్ద అన్నదాత పోరు బాట కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని, రైతులు హాజరు కావాలని ఆయన పిలునిచ్చారు. ఈ కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, నియోజకవర్గ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్, మండలపార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పార్టీ నాయకులు, కార్యకర్తలుపాల్గొన్నారు.

క్లుప్తంగా

పిడుగుపాటుకు చూడి గేదె మృతి



గేదె మృతితో వద్ద విలపిస్తున్న, ఈశ్వరమ్మ

దేవరాపల్లి: ఎ.కొత్తపల్లిలో సోమవారం పిడుగు పాటుకు గురై చూడి గేదె మృతి చెందింది. సోమవారం మధ్యాహ్నం భారీ శబ్దంతో పిడుగు పడడంతో గ్రామంలోని శతపతి ఈశ్వరమ్మకు చెందిన చూడి గేదె మృతి చెందింది. మృతి చెందిన గేదె విలువ సుమారు రూ.లక్ష మేర ఉంటుందని బాధిత పాడి రైతులు తెలిపారు. జీవనాధారమైన గేదె పిడుగు పాటుకు మృతి చెందడంతో బాధిత మహిళా పాడి రైతు బోరున విలపించింది. సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ సంఘటనా స్థలానికి చేరుకొని జరిగిన నష్టాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం బాధిత మహిళకు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదబాధితులకు ఉచిత వైద్యం



పోలీస్ సిబ్బంది సమావేశంలో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ మోహనరావు

అనకాపల్లి: రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులకు ఉచిత వైద్యం అందించే విధంగా కృషి చేయాలని అదనపు ఎస్పీ ఎల్.మోహన్‌రావు అన్నారు. స్థానిక మెయిన్‌రోడ్డు పోలీస్ గెస్ట్ హౌస్ ఆవరణలో సోమవారం పోలీస్ సిబ్బందితో రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రులకు ఉచిత వైద్యంపై ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను దగ్గరలో ఉన్న ఆస్పత్రికి తీసుకుని వెళ్లి వైద్యం అందించాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ ఎం.శ్రావణి, పట్టణ సీఐ టి.వి.విజయకుమార్, ట్రాఫిక్ సీఐ ఎం. వెంకట నారాయణ, ఐటీ కోర్ ఎస్ఐ సురేష్ బాబు పాల్గొన్నారు.

అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

- క్షేత్ర స్థాయి పర్యటనతో సమస్యల పరిష్కారం
- అధికారులకు కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశం
- పీజీఆర్ఎస్‌కు 232 అర్జీలు



అర్జీలు స్వీకరిస్తూ సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ తుహిన్ సిన్హా



పీజీఆర్ఎస్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, జేసీ జాహ్నవి

తుమ్మపాల: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ(పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీల పట్ల నిర్లక్ష్యం వహించొద్దని, అధికారులు వ్యక్తిగతంగా క్షేత్ర స్థాయిలో పర్యటించి పరిష్కరించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆమెతో పాటు జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి, ప్రత్యేక ఉప కలెక్టర్(ఏపీఐఐసీ) అనిత ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి తీసుకున్న అర్జీల గురించి వెంటనే సంబంధిత అదికారులను వివరాలు అడిగి తెలుసుకుని, పరిష్కారానికి సత్వరమే చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి శాఖ అధికారి అర్జీల పరిష్కార పరిస్థితిని ప్రతిరోజు పర్యవేక్షించి, నిర్ణీత సమయంలో చర్యలు తీసుకోవాలన్నారు. మొత్తం 232 అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎస్పీ కార్యాలయంలో 47 అర్జీల స్వీకరణ

అనకాపల్లి: ఎస్పీ కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు 47 అర్జీలు వచ్చాయి. ఎస్పీ తుహిన్ సిన్హా అర్జీదారుల నుంచి అర్జీలు స్వీకరించి, సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూ సమస్యలు-30, కుటుంబ కలహాలు-3, మోసపూర్తి హామీ-1, వివిధ విభాగాలకు చెందినవి-13 అర్జీలు వచ్చాయని చెప్పారు. చట్ట పరిధిలో ఉన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, ఎస్ఐ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కోసం వినతి



డిగ్రీ చదువుకున్న తనకు ఉపాధి కల్పించాలని కశింకోట మండలం తాళ్లపాలెం గ్రామానికి చెందిన దివ్యాంగుడు దాలిబోయిన తరుణ్ కుమార్ కలెక్టర్‌ను వేడుకున్నారు. పుట్టుకతో చర్మవ్యాధి ఉన్నప్పటికి సొంత కాళ్లపై నిలబడాలనే ఆశతో కూలీపనులు చేసుకుంటూ తల్లిదండ్రులు తనను డిగ్రీ చదివించారని, ఉద్యోగం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయన చెప్పారు. దివ్యాంగుల కోటాలో ఉద్యోగం ఇప్పించాలని కోరారు.

ఇల్లు ఆక్రమణపై ఫిర్యాదు



తన ఇంటిని ఆక్రమించి తప్పుడు దస్తావేజులు సృష్టించిన డి.శ్యామలపై పోర్జరీ కేసు నమోదు చేయాలని మునగపాక మండలం టి.సిరసపల్లికి చెందిన పొట్ల వీరునాయుడు ఫిర్యాదు చేశారు. గ్రామంలో పనులు లేక కొన్నేళ్ల క్రితం కుటుంబంతో వలస పోయానని, ప్రస్తుతం కిడ్నీ సమస్యతో పనులు చేయలేక గ్రామంలో సొంతింటికి వస్తే సోదరి సముద్రాలు, ఆమె కుమార్తె శ్యామల అడ్డుకుంటున్నారని ఆయన ఆరోపించారు. తప్పుడు దస్తావేజులు చూపిస్తూ ఇబ్బందులు పెడుతున్నారని వాపోయారు. రిజిస్ట్రార్ ఆఫీసులో ఫిర్యాదు చేయగా.. అవి తప్పుడు దస్తావేజులని తెలిసిందని, వాటిని రద్దు చేసి పోర్జరీ కేసు నమోదు చేయాలని ఆయన కోరారు.

ఉపాధి కూలీల వేదన.. ఖాళీ కంచాలతో నిరసన



ఆజయపురంలో ఖాళీ కంచాలతో ధర్నా చేస్తున్న గిరిజన ఉపాధి కూలీలు

రావికమతం: మూడు మాసాల నుంచి ఉపాధి హామీ కూలీ చెల్లింపులు చేయకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామని చీమలపాడు పంచాయతీ పరిధిలో గల గిరిజన ఉపాధి కూలీలు సోమవారం ఖాళీ కంచాలతో ధర్నా చేశారు. నేరేడుబంద, ఆజయపురం, జీలుగలోవ గ్రామాల్లో ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు వరకు పనిచేసిన ఉపాధి కూలీలకు నగదు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం, గిరిజన సంఘం 5వ షెడ్యూల్ సాధన కమిటీ ఆధ్వర్యంలో ఖాళీ కంచాలతో భిక్షాటన చేసి, ధర్నా నిర్వహించారు. ఉపాధి హామీ చట్టం ప్రకారం పనిచేసిన ప్రతి ఉపాధి కూలీకి పేస్లిప్‌లు ఇచ్చి, రెండు పూటలు పని చేయాలనే నిబంధనలు రద్దు చేయాలన్నారు. ప్రతి 15 రోజులకు ఉపాధి బకాయిలు ఇవ్వకపోవడంతో ఉపాధివేతన దారులు ఇక్కట్లు పడుతున్నారని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కె. గోవిందరావు పేర్కొన్నారు. ఈ ధర్నాలో గిరిజన సంఘం నాయకులు వంతల చిరంజీవి, పాంగి సూరిబాబు, పాంగి శ్రీరామ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ వైద్య కళాశాలలపై ప్రై‘వేటు’ సిగ్గుచేటు

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ



నెహ్రూచౌక్‌లో మాట్లాడుతున్న బాజ్జి

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ పాలనలో పేద విద్యార్థులను దృష్టిలో పెట్టుకుని అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మెడికల్ కళాశాలను ఏర్పాటు చేస్తే, కూటమి పాలనలో మంత్రి మండలి సమావేశంలో ప్రభుత్వం తీసుకున్న వైద్య కళాశాలల పీపీపీ విధాన నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు బి.బాబ్జి అన్నారు. పట్టణంలో పలు ప్రాంతాల్లో ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించి, నెహ్రూచౌక్ వద్ద ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో 17 వైద్య కళాశాలల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదిస్తే... అప్పటి సీఎం జగన్‌మోహన్ రెడ్డి 14 వైద్య కళాశాలకు శంకుస్థాపన చేశారని ఆయన గుర్తుచేశారు. రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాల, విజయనగరం జిల్లాల్లో గత విద్యా సంవత్సరంలో కళాశాలలను ప్రారంభించారన్నారు. జగన్ ప్రభుత్వంలో జీవో నంబర్లు 107, 108 ఉత్తర్వుల్ని తీసుకువచ్చి నూతన మెడికల్ కళాశాలల్లో 50 శాతం ఎంబీబీఎస్ సీట్లను ఇచ్చే విధంగా చర్యలు తీసుకున్నారన్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ తాము అధికారంలోకి వచ్చాక జీవో నెంబర్ 107, 108లు 100 రోజుల్లోనే రద్దు చేసి వైద్య కళాశాలలను నూరుశాతం ప్రభుత్వ కళాశాలలుగా కొనసాగిస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేసుకోవాలన్నారు. అధికారంలోకి వచ్చాక పీపీపీ విధానాన్ని తీసుకొచ్చి వైద్య కళాశాలలను కార్పొరేట్లకు కట్టబెడుతున్నారని దుయ్యబట్టారు. దీనివల్ల నష్టపోయేది విద్యార్థులు మాత్రమే కాదని, పేద వర్గాల ప్రజలు కూడా ఉచిత వైద్యానికి దూరమవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి వి.రాజు, ఏఐఎస్ఎఫ్ నియోజవర్గ నాయకులు లతా, సీత, నవ్య పాల్గొన్నారు.

వాహనం ఢీకొని విరిగిన విద్యుత్ స్తంభం

- దేవరాపల్లిలో రోడ్డుపై తెగిపడిన తీగలు
- అర్ధరాత్రి జనసంచారం లేక పోవడంతో తప్పిన ముప్పు



విరిగిన స్తంభాన్ని, రోడ్డుపై తెగిపడిన విద్యుత్ వైర్లను తొలగిస్తున్న సిబ్బంది

దేవరాపల్లి: మండల కేంద్రం దేవరాపల్లి నాలుగు రోడ్ల కూడలిలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో ఓ విద్యుత్ స్తంభం నేలకొరింది. విద్యుత్ తీగలు తెగి రోడ్డుపై పడ్డాయి. ఆ సమయంలో జన సంచారం లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. అర్ధరాత్రి సమయంలో జరిగిన ఈ ఘటనపై స్థానికులు కొందరు గమనించి స్థానిక విద్యుత్ లైన్‌మెన్ బి.రాముకు సమాచారం అందించారు. వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. స్థానిక ఎస్ఐ వి.సత్యనారాయణ కూడా సంఘటన స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌ను మళ్లించి, తెగిన విద్యుత్ వైర్లను తొలగింపజేశారు. విద్యుత్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన విరిగిన స్తంభం స్థానంలో కొత్తది ఏర్పాటు చేశారు.

నిరుపేద కళాకారులకు కాప్ చేయూత

సినీ హాస్యనటుడు గౌతంరాజు

అనకాపల్లి: రాష్ట్రంలోని నిరుపేద కళాకారుల ఆర్థికాభివృద్ధి, ఉపాధి కల్పనకు కాప్ (సినీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్-(కాప్) పని చేస్తుందని సినీ హాస్య నటుడు భూపతిరాజు గౌతంరాజు అన్నారు. అనకాపల్లి లాఫింగ్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక గవరపాలెం మళ్ల జగన్నాథం కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి 'కామెడీ కిచుకిచుమా' కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. కళలను, కళాకారులను అనకాపల్లి ప్రజలు విశేషంగా ఆదరిస్తారని, ప్రతి నెలా మొదటి ఆదివారం లాఫింగ్ క్లబ్ కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా చిన్న, మధ్యతరహా కళాకారుల వివరాలను సేకరించి త్వరలో ప్రత్యేక డైరీని రూపొందించనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఈ డైరీ బుల్లి తెర, సినిమా రంగాల దర్శక, నిర్మాతలకు దోహదపడుతుందని, ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. సినీ కళాకారులతో కొన్ని ఈవెంట్లు నిర్వహించి తద్వారా సమకూరిన నిధిని, నిరుపేద కళాకారులను ఆదుకోవడానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ హాస్యనటుడు, దివంగత పీలా మల్లికార్జునరావు (బట్టల సత్యం)తో తనకున్న అనుబంధాన్ని ఆయన గుర్తు చేసుకున్నారు. గౌరీ గ్రంథాలయం కార్యదర్శి కాండ్రేగుల వెంకటరమణ మాట్లాడుతూ అర్హతలతో సంబంధం లేకుండా అన్ని వర్గాలు ఆస్వాదించేది ఒక్క హాస్యమేని, ఆసుపత్రుల్లో ప్రత్యేకంగా లాఫింగ్ వార్డును ఏర్పాటు దిశలో ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు విల్లూరి వీర సంతోష్, ఉపాధ్యక్షుడు బుద్ద ప్రవీణ్‌కుమార్, క్లబ్ సభ్యులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

వేంపాడులో భారీ చోరీ

రూ.4 లక్షల విలువైన బంగారు ఆభరణాలు అపహరణ

నక్కపల్లి: వేంపాడులో సోమవారం ఒక ఇంట్లో చోరీ జరిగింది. సుమారు రూ.4లక్షలు విలువైన బంగారు ఆభరణాలను దుండగులు ఎత్తుకుపోయారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన కొత్త నాగేశ్వరరావు రామాలయం ఎదురుగా కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. వెనుక భాగంలో నివసిస్తున్నాడు. తన భార్యను షాపులో ఉంచి వ్యక్తిగత పనిపై తుని వెళ్లాడు. మధ్యాహ్నం నాగేశ్వరరావు భార్య షాపు మూసి వేసి భోజనం కోసం ఇంటికి వెళ్లగా గేటుకు వేసిన తాళాలు, లోపల తలుపులు తాళాలు పగులగొట్టి ఉన్న విషయం గుర్తించింది. లోపలకు వెళ్లి చూడగా పెట్టెలో ఉంచి రెండున్నర తులాల బంగారు చైను, అరతులం బంగారు లాకెట్, పావుతులం ఉంగరం, అరతులం బంగారు ముద్ద, పావు తులం ఉంగరం కనిపించలేదు. చోరీ జరిగినట్టు గుర్తించి తన భర్తకు విషయం తెలియజేసింది. వెంటనే బాధితులు నక్కపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. చోరీ అయిన ఆభరణాలు విలువ సుమారు రూ.4 లక్షలు ఉంటుందని బాధితులు చెబుతున్నారు. సీఐ కుమార స్వామి, ట్రైనీ ఎస్ఐ సాహి అంజు చోరీ జరిగిన ఇంటిని పరిశీలించారు. కేసు నమోదు చేశారు. క్లూస్ టీమును రప్పిస్తున్నారు. దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

గల్లంతైన మహిళ మృతదేహం లభ్యం

కశింకోట/మునగపాక: కశింకోట మండలం వెదురుపర్తి ప్రాంతంలో సోమవారం రాత్రి ఓ మహిళ మృతదేహాన్ని కనుగొన్నారు. ఉమ్మలాడ వద్ద శారదానదిలో దూకి కీర్తికుమారి అనే మహిళ మూడు రోజుల క్రితం ఆత్మహత్య చేసుకొని గల్లంతైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కశింకోట వంతెన-వెదురుపర్తి మధ్య ప్రాంతంలో నదిలో చెట్టుకు చిక్కుకొని మృతదేహం ఉన్నట్టు స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. ఆ మృతదేహాన్ని పరిశీలించి గల్లంతైన కీర్తికుమారిగా అధికారులు నిర్ధారించారు. ఎస్‌డీఆర్ఎఫ్ సభ్యులు మూడు రోజులుగా జల్లెడ పట్టారు. సోమవారం డ్రోన్‌ను సైతం వినియోగించారు. చివరకు వెదురుపర్తి సమీపంలో నదిలో మృతదేహం లభ్యమైంది.

ఒకే రోజు అల్లుడు, మామ మృతి



అప్పారావు



సన్యాసిరావు

మునగపాక: ఓ కుటుంబంపై విధి కన్నెర్ర చేసింది. ఒకే ఇంట్లో ఒకే రోజు అల్లుడు, మామ మృతితో తీవ్ర విషాదం నింపింది. సోమవారం అనారోగ్యంతో చనిపోయిన తన మామ అంత్యక్రియలకు అవసరమైన కట్టెలు తెచ్చేందుకు పొలానికి వెళ్లిన అల్లుడు విద్యుత్ షాక్‌కు గురై మృత్యువాతకు గురైన ఘటన నారాయుడుపాలెంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. నారాయుడుపాలెం గ్రామానికి చెందిన కొయ్య మీసాల అప్పారావు(64) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. కుటుంబ సభ్యులు అతని అంత్యక్రియలకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. దీనిలో భాగంగా అప్పారావు అల్లుడు ప్రసాదుల సన్యాసిరావు(54) అవసరమైన కట్టెలను తెచ్చేందుకు మధ్యాహ్నం స్థానికులతో కలిసి పొలానికి వెళ్లాడు. పొలంలో తెగిపడి ఉన్న విద్యుత్ వైర్లు ఆయన కాలికి తగలడంతో సన్యాసిరావు అక్కడికక్కడే మృతి చెందారు. కుటుంబానికి పెద్ద దిక్కుగా ఉన్న ఆయన విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందడంతో కుటుంబ సభ్యులు బోరున విలపిస్తున్నారు. మృతుడికి భార్య వెంకటలక్ష్మి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మునగపాక ఎస్ఐ పి.ప్రసాదరావు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని అనకాపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. విద్యుత్ శాఖ ఏఈ శరగడం జగదీష్.. నారాయుడుపాలెంలో సంఘటన స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలపై ఆరా తీశారు.

క్లుప్తంగా

ప్రమాదాల నివారణకు ఫేస్ వాష్



కశింకోటలో హైవేపై వాహన డ్రైవర్‌కు నీళ్లు అందజేస్తున్న సీఐ అల్లు స్వామినాయుడు

కశింకోట: స్థానిక జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు పోలీసులు ఫేస్ వాష్ కార్యక్రమాన్ని సోమవారం వేకువజామున నిర్వహించారు. ఈ సందర్భంగా వాహనాలను నిలిపి డ్రైవర్లకు నిద్ర మత్తు వదిలించడానికి నీళ్లు ఇచ్చి ముఖం శుభ్రం చేయించారు. దూరం నుంచి వస్తూ నిద్రమత్తులో ప్రమాదాలకు కారణమయ్యే అవకాశం ఉన్నందున ఫేస్ వాస్ కార్యక్రమాన్ని చేపట్టామని ఈ సందర్భంగా సీఐ అల్లు స్వామినాయుడు తెలిపారు. ఈ కార్యక్రమానికి వాహన డ్రైవర్లు సహకరించి ప్రమాదాలు అరికట్టడానికి దోహదపడాలని కోరారు. ఎస్ఐలు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

సిమెంట్ పరిశ్రమ ఏర్పాటు చేయొద్దని వినతి

కశింకోట: మండలంలోని ఏఎస్ పేటలో సిమెంట్ పరిశ్రమ యూనిట్ -2 ఏర్పాటుకు అనుమతి రద్దు చేయాలని గ్రామ రైతు బుద్ద వెంకటరమణ కోరారు. దీనిపై గొబ్బూరులో గ్రామసభ నిర్వహించకుండా అనుమతి ఇచ్చిన గత పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు సోమవారం అనకాపల్లిలో కలెక్టర్ విజయకృష్ణన్‌కు వినతి పత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు. రెండో యూనిట్‌కు అనుమతి ఇవ్వడం వల్ల సిమెంట్‌లో కలిపే శ్లాగ్ ఎగిరి పడి చుట్టు పక్కల భూముల్లో పంట పండక రైతులు తీవ్రంగా నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. ప్రజలకు ఆరోగ్య సమస్యలు, పర్యావరణ సమస్యలు ఏర్పడతాయని వాపోయారు.

లింగ నిష్పత్తి పెంచడమే లక్ష్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో షేక్ ఆయేషా

తుమ్మపాల: లింగ నిర్ధారణ నిరోధక చట్టం పటిష్టంగా అమలు చేయాలని ఆర్డీవో షేక్ ఆయేషా ఆదేశించారు. పీసీపీఎన్‌డీటీ-1994 చట్టం అమలుపై ఆమె తన కార్యాలయంలో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 0 నుంచి 6 ఏళ్ల పిల్లల లింగ నిష్పత్తి పెంచడమే లక్ష్యంగా అధికారులు లింగ నిర్ధారణ చట్టాన్ని అమలు చేయాలన్నారు. లింగ నిర్ధారణ, ఆడ శిశువుల భ్రూణ హత్యలను నిరోధించాలన్నారు. సంఘంలో పురుష సంతాన ప్రాధాన్యత, మూఢ నమ్మకాలు వంటి సామాజిక రుగ్మతల దృష్ట్యా ఆడ పిల్లలపై వివక్ష పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో దేవరాపల్లి, అచ్యుతాపురం, రాంబిల్లి ఎన్జీవో సంఘాలు, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి కె.చంద్రశేఖర్‌దేవ్, లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ రాకేష్ పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు శనివారం 119 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,200	4,240
రెండో రకం	3,760	3,760
మూడో రకం	3,300	3,690

అనకాపల్లి సినిమాలు

రాజా	: మదరాసి
సత్యనారాయణ స్క్రీన్-1	: కొత్తలోక
సత్యనారాయణ స్క్రీన్-2	: ది కన్జూరింగ్ 4 లాస్ట్ రైట్స్
పర్తిసాయి	: ఘాటీ
షిర్డీసాయి	: కూలీ
వెంకటేశ్వర	: లిటిల్ హార్ట్స్
రామచంద్ర	: వార్-2

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 79 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్-9, బీ పాజిటివ్-27, ఓ పాజిటివ్-39, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంక్ టెక్నీషియన్ యాలోకేష్ (9703613706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా సోమవారం 364 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 321 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి (08924-223595)ని సంప్రదించవచ్చు.

నిరుపయోగంగా దుకాణాలు

- గతంలో వేలం వేసినా స్పందన కరువు
- అసాంఘిక కార్యకలాపాలకు నిలయం
- శిథిలావస్థలో మరికొన్ని భవనాలు
- అద్దె ఆదాయం కోల్పోతున్న జీవీఎంసీ



పెరుగుబజార్ షాపింగ్ కాంప్లెక్స్ ముందు చెత్తా చెదారం



ఉడ్‌పేట షాపింగ్ కాంప్లెక్స్



పెరుగుబజార్ జంక్షన్‌లో ఖాళీగా షాపింగ్ కాంప్లెక్స్



పెరుగుబజార్ షాపింగ్ కాంప్లెక్స్ మొదటి అంతస్తులో మందుబాటిళ్లు, వాటర్ గ్లాసులు

అనకాపల్లి టౌన్: పట్టణంలోని జీవీఎంసీ వ్యాపార సముదాయాల్లో 60 షాపులు నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇవి అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారాయి. మరికొన్ని శిథిలమై కూలిపోయే స్థితికి చేరుకున్నాయి. వీటిని పాలకులు గానీ అధికారులు గానీ వినియోగంలోకి తేవడానికి నిర్లక్ష్యం వహిస్తున్నారు. దాంతో జీవీఎంసీ లక్షలాది రూపాయల ఆదాయం కోల్పోతుంది.

జీవీఎంసీకి పట్టణ పరిధిలో మొత్తం 14 షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో 159 షాపులు ఉన్నాయి. నాలుగు రోడ్ల జంక్షన్, టౌన్ గ్లర్స్ హైస్కూల్ వద్ద, పెరుగుబజార్ జంక్షన్, ఉడ్‌పేట షాపింగ్ కాంప్లెక్స్, మున్సిపల్ ప్లే గ్రౌండ్స్, మున్సిపల్ గవరపాలెం హైస్కూల్ షాప్స్, ఎన్టీఆర్ మున్సిపల్ స్టేడియం, న్యూకాలనీ, గవరపాలెం గర్ల్స్ హైస్కూల్, సతకం పట్టు ఏరియా, రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం, ఇలా ప్రతీ ఏరియాల్లో ప్రభుత్వ షాపులు ఉన్నాయి.

ఖాళీగా ఉన్న దుకాణాలు 60..

పెరుగుబజార్ షాపింగ్ కాంపెక్స్‌లో 25 షాపులకు 17, ఉడ్‌పేట బ్లాక్ -బిలో 11 షాపులకు 8, ఉడ్‌పేట రామచంద్ర థియేటర్ వైపు బ్లాక్ ఏ- 12 షాపులకు 5, సతకంపట్టు ఏరియాలో 3 షాపులకు 3, రాజీవ్ గాంధీ ఇండోర్ స్టేడియం షాపులలో 10కి 10, న్యూకాలనీలో 8 షాపులకు 5, టౌన్ గర్ల్స్ హైస్కూల్ వద్ద 5 షాపులకు 5, నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద 25 షాపులకు 5 షాపులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో మున్సిపల్ గవరపాలెం హైస్కూల్ వద్ద 6 షాపులూ శిథిలావస్థకు చేరుకున్నాయి. ఇక్కడ మొత్తం షాపులన్నీ పడగొట్టి నూతనంగా నిర్మించాలి. గతంలో వీటికి వేలం నిర్వహించినా అద్దె ఎక్కువగా ఉండటంతో ఎవరూ ముందుకు రాలేదు. పోని అద్దె తగ్గించి ఇద్దామంటే ప్రభుత్వ నిబంధనలు అడ్డంకిగా ఉన్నాయని జీవీఎంసీ అధికారులు వాపోతున్నారు.

నాలుగు రోడ్ల కూడలిలో షాపులకు డిమాండ్

పట్టణానికి గుండెకాయ వంటి నాలుగు రోడ్ల కూడలిలో షాపులకు విపరీతంగా డిమాండ్ ఉంది. ఇక్కడ షాపు దొరకాలంటే సిఫార్సులు, లాబీయింగ్‌లు చేస్తుంటారు. ఉదాహరణకు 10 ఇంటూ 12 సైజులో షాపునకు గుడ్‌విల్ రూ.8 నుంచి రూ.10 లక్షలు పలుకుతుంది. ఈ అమౌంట్ తిరిగిరాదు. ఇక ఈ షాపునకు అద్దె రూ.30 వేలు పైమాటే. ఇంత డిమాండ్ ఉన్న ఏరియాలో ప్రభుత్వ షాపులు నాలుగు ఖాళీగా ఉన్నాయి. పెరుగుబజార్ సెంటర్‌లోని 25 షాపులకు 17 ఖాళీగా ఉన్నాయి. ఇక్కడ ప్రైవేటు షాపులు ఒక్కొక్కటీ రూ.25 వేల నుంచి రూ.30 అద్దె వసూలు చేస్తున్నారు. ఈ రెండు ప్రాంతాల్లో కొన్ని షాపులకు డోర్లు విరిగిపోగా, మరొక షాపును పబ్లిసిటీ బోర్డుతో ఆక్రమించేశారు. పెరుగుబజార్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌లోకి మొదటి అంతస్తు పూర్తిగా అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారింది. ఇక్కడ షాపుల ముందు చెత్త చెదారం, ఖాళీ మందు బాటిల్స్, తాగి పారేసిన గ్లాసులు, వాటర్ ప్యాకెట్లు దర్శనమిస్తున్నాయి. ఇలా పట్టణంలో పలు ప్రాంతాల్లో ఖాళీగా షాపులు దర్శనమిస్తున్నాయి.

అడ్డొస్తున్న నిబంధనలు..

వాస్తవానికి ఒక షాపు అద్దెకు తీసుకోవాలంటే అప్పుడున్న పరిస్థితుల బట్టి రిజిస్ట్రార్ ఆఫీస్‌లో లెక్కల ప్రకారం మార్కెట్ విలువలో 10 శాతం సంవత్సర అద్దెగా నిర్ణయించడం, రెండో పద్ధతి ప్రైవేటు షాపుల విలువ లెక్కించి రెండిటిలో ఏది ఎక్కువ ఉంటే అది నిర్ణయించడం, సంవత్సరం అద్దె బ్యాంకు గ్యారంటీ చూపడం, 4 నెలల బయానా నిబంధనలు ఉండడంతో వర్తకులు ఆసక్తి చూపడం లేదు.

అద్దెలు తగ్గిస్తే తీసుకుంటాం



ప్రైవేటు షాపుల మాదిరిగా అద్దెలు ఉన్నాయి. జిల్లా కేంద్రమైన అంతంత మాత్రంగానే వ్యాపారాలు సాగుతున్నాయి. ప్రభుత్వ షాపుల అద్దెలు తగ్గిస్తే తీసుకుంటాం.

– జె చలమయ్య శెట్టి, అనకాపల్లి

షాపులను వినియోగంలోకి తెస్తాం

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అద్దె నిర్ణయిస్తే వ్యాపారుల ఎవరూ ఆసక్తి చూపడంలేదు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిరుపయోగంగా ఉన్న షాపులను అందుబాటులోకి తీసుకువస్తాం. కొన్ని షాపులు ప్రభుత్వం నుంచి తీసుకున్నది ఒకరు, ఇప్పుడుంటున్నది మరొకరు, వీటన్నిటిపై సమీక్ష చేస్తున్నాం

–చక్రవర్తి, జోనల్ కమిషనర్, అనకాపల్లి

ఆలయాలకు సంప్రోక్షణ



ధ్యాన వేంకటేశ్వరస్వామి దివ్య దర్శనం

కశింకోట: చంద్ర గ్రహణం కారణంగా మూత పడిన ఆలయాలను సంప్రదాయంగా సంప్రోక్షణ చేసి సోమవారం ఉదయం యధా విధిగా తెరచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక వేణుగోపాలస్వామి, శివాలయం, లక్ష్మీనృసింహస్వామి, కోదండ సీతారామాలయం, నూకాంబిక, వేంకటేశ్వరస్వామి ధ్యాన మందిరం, గవరపేటలోని వేంకటేశ్వర స్వామి ఆలయం, పలు వీధుల్లో ఆంజనేయస్వామి ఆలయాలను భక్తుల దర్శించి పూజలు చేశారు. స్థానిక శారదా నదిలో ఆదివారం రాత్రి చంద్రగ్రహణం ప్రారంభంలోను, గ్రహణం ముగిశాక సంప్రదాయంగా స్నానాలు ఆచరించారు. ఇళ్లను శుభ్రపరచుకొని పూజలు చేశారు.

ఆలయ పునర్నిర్మాణ పనుల పరిశీలన



ఆలయ నూతన భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణ

అనకాపల్లి: స్థానిక గవరపాలెం నూకాంబిక ఆలయ పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవదాయ శాఖ ఆధ్వర్యంలో నాలుగు మాసాల్లో అమ్మవారి ఆలయ పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. అంతకుముందు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో దేవదాయ శాఖ సహాయ కమిషనర్, ఆలయ ఈవో కె.ఎల్.సుధారాణి, ఆలయ మాజీ చైర్మన్ పీలా నాగశ్రీను, ఉద్యోగులు పాల్గొన్నారు.

అంధకారంలో ఎన్టీఆర్ ఆస్పత్రి

- మాటిమాటికీ నిలిచిన విద్యుత్ సరఫరాతో అవస్థలు
- జనరేటర్ పనిచేయక ఉక్కిరిబిక్కిరైన రోగులు



విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో ఎన్టీఆర్ ఆస్పత్రిలో రోగుల దుస్థితి

సాక్షి, అనకాపల్లి: మాటిమాటికీ విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో ఎన్టీఆర్ జిల్లా ఆస్పత్రిలో రోగులు అవస్థల పాలయ్యారు. జనరేటర్ పనిచేయకపోవడంతో ఐసీయూ, వార్డుల్లో ఉన్న రోగులు ఉక్కిరిబిక్కిరయ్యారు. సోమవారం రాత్రి గంట వ్యవధిలో మూడు నాలుగుసార్లు కరెంటు పోయింది. కనీసం అందుబాటులో ఎలక్ట్రీషియన్ కూడా లేకపోవడంతో ఏమి చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో కొంతసేపు రోగుల బంధువులు ఆందోళన చేశారు. గతంలోనూ ఇలాగే పలుమార్లు విద్యుత్ అంతరాయం కారణంగా రోగులు ఇబ్బందులు పడ్డారు. జనరేటర్ సేవలు దైవాధీనం కావడంతో అత్యవసర స్థితిలో ఉన్న రోగుల పరిస్థితి అగమ్యగోచరమే. ఎవరైనా ఫిర్యాదు చేస్తే జిల్లా ఉన్నతాధికారులు వచ్చి చట్టం చూపుగా చూసి వెళ్లిపోవడం తప్ప క్షేత్ర స్థాయిలో వచ్చే విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కార మార్గం చూపడంలో విఫలమవుతున్నారని రోగులు బంధువులు వాపోతున్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



అక్షరాస్యత ఆవశ్యకతపైన, పొగాకుకు వ్యతిరేకంగా వేసిన చిత్ర లేఖనాలు ప్రదర్శన



డీపీఎన్ జెడ్పీ హైస్కూలు విద్యార్థుల ర్యాలీ

కశింకోట: స్థానిక డీపీఎన్ జెడ్పీ హైస్కూలులో ప్రపంచ అక్షరాస్యత, పొగాకు వ్యతిరేక దినోత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులు ర్యాలీ నిర్వహించారు. అంతా అక్షరాస్యులు కావాలని, పొగ తాగరాదని నినాదాలు చేశారు. విద్యార్థులకు ఈ సందర్భంగా చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. వాటిని ప్రదర్శించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రసాద్, పీడీలు వేదుల ప్రభాకరరావు, పెంటకోట కమల, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

పాడుబడిన బావి కప్పేయాలని ధర్నా



మాట్లాడుతున్న సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్

అనకాపల్లి టౌన్: మండలంలోని ముత్రాసు కాలనీలో పాడు బడిన నుయ్యిని తక్షణమే మూసివేయాలని సీపీఎం, ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. స్థానిక జీవీఎంసీ జోనల్ కార్యాలయం వద్ద సోమవారం ధర్నా కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ మాట్లాడుతూ పాడైపోయిన నుయ్యిని మూసివేయమని కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినా జోనల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ప్రజాసంఘాల నాయకుడు గుడాల సత్యనారాయణ మాట్లాడుతూ పాడు బడిన బావిలో కుక్కలు, పిల్లులు చనిపోవడం వల్ల ఈ ప్రాంతంలో తీవ్ర దుర్వాసన వసుందన్నారు. దోమలు పెరిగి వ్యాధుల బారిన పడుతున్నారన్నారు. సమస్య పరిష్కారానికి జీవీఎంసీ అధికారులు హామీ ఇవ్వడంతో సుమారు గంట సేపు జరిగిన ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో కాళ్ల తేలయ్యబాబు, పి శ్రీనువాసరావు, చిత ఓం శివ, బొడ్డు శ్రీనివాసరావు, ఎస్ దుర్గ అప్పారాజు తదితరులు పాల్గొన్నారు.

భర్త మద్యం మానలేదని గృహిణి ఆత్మహత్య

పెందుర్తి: దేవుడి మీద ప్రమాణం చేసిన తరువాత కూడా తన భర్త మద్యం తాగడం మానలేదని మనస్తాపం చెందిన ఓ గృహిణి ఆత్మహత్యకు పాల్పడింది. పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధి ప్రహ్లాదపురం శ్రీనివాస నగర్ సమీపంలోని బీహెచ్‌పీవీ కాలనీలో సోమవారం జరిగిన ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీలో నివాసం ఉంటున్న తోట నళిని కుమార్తె హరిత(27)కు కాకినాడకు చెందిన బిరడా శ్రీనుతో మూడేళ్ల క్రితం పెద్దలు వివాహం జరిపించారు. ఆటో నడిపే శ్రీను తన భార్యను తీసుకుని కొన్నాళ్ల క్రితం నగరానికి వచ్చి, అత్తవారింటికి సమీపంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నాడు. శ్రీనుకు మద్యం అలవాటు ఉండడంతో తరచూ భార్యభర్తల మధ్య గొడవలు జరిగేవి. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం సింహాచలం దేవస్థానానికి భార్య హరితను తీసుకెళ్లి, తాను మద్యం మానేస్తున్నట్లు దేవుడిపై ఒట్టు వేసి కడియం ధరించాడు. అయితే మాట మీద నిలబడకుండా ఆది, సోమవారాల్లో శ్రీను మద్యం సేవించాడు. దీంతో తీవ్ర మనస్థాపానికి గురైన హరిత సోమవారం మధ్యాహ్నం ఇంట్లో ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుని మృతి చెందింది. కాసేపటికి ఇంటికి వచ్చిన శ్రీను తలుపులు కొట్టినా హరిత తీయకపోవడంతో బావమరిది తోట సాయికుమార్‌కు సమాచారం ఇచ్చాడు. ఇద్దరూ కలిసి తలుపును బలవంతంగా తెరిచి చూడగా.. హరిత అప్పటికే మృతి చెందింది. సమాచారం అందుకున్న పెందుర్తి పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. మృతురాలి తల్లి తోట నళిని ఫిర్యాదు మేరకు సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు జరుగుతోంది.

రైతులకు కౌలు భూముల అప్పగింత

కశింకోట: దేవదాయ శాఖకు చెందిన స్థానిక వేణుగోపాలస్వామి ఆలయ భూములను మూడేళ్ల కౌలు విధానంపై వేలంలో పాడుకున్న రైతులకు సోమవారం వాటిని పోలీసు బందోబస్తు మధ్య అప్పగించారు. ఇటీవల వేలం పాట నిర్వహించగా ఈ సారి ఎనిమిది మంది కొత్త రైతులు దక్కించుకున్నారు. ఈ మేరకు దేవదాయ శాఖ ఈవో సత్యనారాయణ వారికి భూములు అప్పగించారు.

ప్రభుత్వ భూమిలో ఆక్రమణల తొలగింపు



ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న ఆర్ఐ వీరయ్య తదితరులు

సబ్బవరం: మండలంలోని అమృతపురం గ్రామంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూమిని రెవెన్యూ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకొన్నారు. అమృతపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.379లో 35.64 ఎకరాల గయాళు ప్రభుత్వ భూమిలో తహసీల్దార్ బి.చిన్నికృష్ణ ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించారు. ఆర్ఐ వీరయ్య సిబ్బందితో కలిసి ఆక్రమణలు తొలగించి, ప్రభుత్వ భూమిలో హెచ్చరికల బోర్డు ఏర్పాటు చేశారు. స్వాధీనం చేసుకున్న ప్రభుత్వ భూమిని ఆక్రమించినా, హెచ్చరికల బోర్డును తొలగించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ హెచ్చరించారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత నాగజ్యోతికి సత్కారం



నాగజ్యోతిని సత్కరిస్తున్న హెచ్‌ఎం శేషగిరిరావు

రోలుగుంట: రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించి స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు వచ్చిన ఇంగ్లిష్ టీచర్ పీవీఎం నాగజ్యోతికి సోమవారం విద్యార్థులు బ్యాండు మేళాలతో స్వాగతం పలికారు. ఆమెను ఉపాధ్యాయులు సన్మానించారు.

అన్నదాత పోరు విజయవంతం చేయండి



అన్నదాత పోరు పోస్టర్ ఆవిష్కరిస్తున్న పార్టీ జిల్లా అధికార ప్రతినిధి బుల్లిబాబు

కశింకోట: వైఎస్సార్ సీపీ అధిష్టానం పిలుపు మేరకు ఎరువుల కొరతపై నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు కోరారు. సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో పోస్టర్‌ను పార్టీ శ్రేణులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అవసరం ఉన్న మేరకు యూరియా అందివ్వకుండా రైతులను ఇబ్బందులకు గురి చేస్తోందన్నారు. ఈ విషయమై పార్టీ ఆధ్వర్యంలో అనకాపల్లిలో మంగళవారం నిర్వహించనున్న అన్నదాత పోరు కార్యక్రమానికి రైతులు, పార్టీ శ్రేణులు, అభిమానులు, హాజరై విజయవంతం చేయాలని కోరారు.

అనకాపల్లి: దేశానికి అన్నం పెట్టే రైతులకు ఎరువులు పంపిణీ చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, దీనికి నిరసనగా మంగళవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద అన్నదాత పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు మందపాటి జానకీరామరాజు, పెదిశెట్టి గోవింద్‌లు సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్, వివిధ నియోజకవర్గాల సమన్వయకర్తలు విచ్చేయుచున్నట్లు పేర్కొన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులో పార్టీ కార్యాలయం నుంచి ఉదయం 9 గంటలకు ర్యాలీగా ఆర్డీవో కార్యాలయానికి చేరుకుని అక్కడ రైతులతో నిరసన తెలియజేసి, ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తామన్నారు. రైతులు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరు కావాలని కోరారు.

జనసేన పార్టీ నేతల తీరు మార్చుకోవాలి

- వైఎస్సార్‌సీపీ గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ

అనకాపల్లి: జనసేన పార్టీ నాయకులు వ్యక్తిగత విమర్శలకు పాల్పడకుండా నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని, లేదంటే రానున్న రోజుల్లో ప్రజలే బుద్ధి చెబుతారని వైఎస్సార్‌సీపీ గవర కార్పొరేషన్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ బొడ్డేడ శివ తెలిపారు. స్థానిక రింగ్‌రోడ్డు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ వైఎస్సార్‌సీపీ ప్రజల పక్షాన పోరాటాలు చేస్తుందన్నారు. దాన్ని జీర్ణించుకోలేక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ అనుచరులు వ్యక్తిగత విమర్శలకు పోవడం ఏమిటని ప్రశ్నించారు. ఎమ్మెల్యేకు మచ్చతెచ్చే విధంగా మాట్లాడడం మార్చుకోవాలన్నారు. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, మాజీ మంత్రి దాడి వీరభద్రరావు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ రాజకీయాల్లో ఎంతో హుందాగా వ్యవహరిస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ విలువలతో కూడిన రాజకీయం చేస్తుందన్నారు. పార్టీ పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు వేగి త్రినాథ్ మాట్లాడుతూ మూడున్నర సంవత్సరాల పాలనలో మంచి పనులు చేసి అభివృద్ధి చూపించాలని హితవు పలికారు. 80వ వార్డు ఇన్‌చార్జి కె.ఎం.నాయుడు మాట్లాడుతూ బడి, గుడి, పోలీస్‌స్టేషన్ వద్ద మెయిన్‌రోడ్డు సత్య థియేటర్‌లో కొత్తగా రాయల్ బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేయవద్దని డిమాండ్ చేస్తే, వ్యక్తిగత విమర్శలకు పోవడం అన్యాయమన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు తుమ్మపాల, రైల్వే స్టేషన్ రహదారులపై ధర్నాలు చేస్తే అభివృద్ధి చేశారన్నారు. గత ప్రభుత్వ హయాంలో జాతీయ రహదారి జలగల మదుం జంక్షన్ నుంచి సుంకరమెట్ట జంక్షన్, ఏఎంఏఎల్ కళాశాల నుంచి కుంచంగి, కూండ్రం రహదారి, గవరపాలెం నూకాంబిక ఆలయం పునఃనిర్మాణం, పీహెచ్‌సీలు, ఆర్‌బీకేలు, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు వంటి నిర్మాణాలు చేశామన్నారు. జనసేన నాయకులు ఇవేమీ కనిపించకపోతే కళ్ల డాక్టర్‌కు చూపించుకోవాలని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనధికార ఎరువుల విక్రయాలపై దాడులు

రావికమతం: మండలంలో అనధికార ఎరువుల విక్రయాలపై విజిలెన్స్, పోలీసులు, వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం ఆకస్మిక దాడులు నిర్వహించారు. 4.9 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశారు. తట్టబందకు చెందిన వ్యాపారి కుండేలా అప్పారావు స్థానిక చెరకు కాటాకు సమీపంలో బలిజిపాలెం దగ్గర్లోని దుకాణంలో ఎరువులను భారీగా నిల్వ చేసి ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. గతంలో నిషేధించిన 17–17–17 రకం ఎరువును కూడా బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. ఎరువుల దుకాణంకు సంబంధించి లైసెన్సు, ఎటువంటి అనుమతులు లేవు. ఈ నేపథ్యంలో రైతుల నుంచి ఫిర్యాదులు అందడంతో విజిలెన్స్ అధికారి రవికుమార్ ఆధ్వర్యంలో మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్‌బాబు, రావికమతం ఎస్ఐ రఘువర్మ, వీఆర్వో బాలాజీ సోమవారం సాయంత్రం కుండేల అప్పారావు అనధికార ఎరువుల దుకాణంపై దాడులు నిర్వహించి, అక్రమ నిల్వలను సాధీనం చేసుకుని, దుకాణంను సీజ్ చేశారు. వ్యాపారి అప్పారావుపై చట్టపరమైన చర్యలకు ఉన్నతాధికారులకు సిఫార్స్ చేయనున్నట్టు ఏవో రమేష్‌బాబు తెలిపారు.